# బాకీ

## -అవధానుల సుధాకరరావు

"వాడసలు మనిషేనా? తింటున్నది అన్నమేనా?" అన్నది జానకమ్మ అసహ్యం మిళితమైన ఆవేశంతో ఊగిపోతూ. బాధతో విలవిల్లాడిపోయాడు ధర్మయ్య. నొచ్చుకుంటూ చూసాడు.

"తప్పు జానకీ! ఏ మనిషినీ నిందించకూడదు. భగవంతుడు మనకు నోరిచ్చింది మితంగా ఆహారం తీసుకోవడానికి, నాలుగు మంచి మాటలు మాట్లాడ్డానికేతప్ప ఇలా పరుష వాక్యాలు పలకడానికా?" అంటూ హితవు చెప్పాడు.

"స్వామీ! మీరు మహా భక్తులు, శాంతస్వభావులు. నేనొక సామాన్యురాలిని. మీ అంత ఔదార్యం దేవుడు నాకివ్వలేదు. ఇది తేలికైన విషయమా చెప్పండి? ఇద్దరం కలసి మనకున్న కొద్దిపాటి పొలంలో ఏడాది పొడవునా రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట. దాని విలువ తొంభైవేలు. గద్దలా తన్నుకుపోయాడు. దొంగలా కాజేసాడు. దుర్మార్గపు వెధవు" అంటూ పెద్ద గొంతుతో ఆపకుండా అరుస్తూ ఉంటే వినలేకపోయాడు ధర్మయ్య. దాని మూలంగా చదువుతున్న రామాయణ గ్రంథం మీద మనసు నిలపలేకపోయాడు. అందుకే పుస్తకం మూసాడు ఇక లాభం లేదనుకుని.

"ఇద్దరికీ అన్నం వడ్డించు జానకీ. వేళ దాటిపోతోంది" అంటూ లేచి నిలబడ్డాడు.

"ఆ దౌర్భాగ్యుడు చేసిన ద్రోహానికి కడుపుమండి కోపంతో నిండిపోయాక ఇక ఆకలికి చోటేది స్వామీ? మీకు వడ్డించేస్తా. కాళ్లు కడుక్కుని రండి" అని వంటింట్లోకి వెళ్లింది.

ధర్మయ్య నిట్టూర్పుతో పెరట్లోకి కదిలాడు.

***

సీతాపురం కూడా పల్లెటూరే అయినప్పటికీ చుట్టుపక్కల వున్న అనేక పల్లెటూళ్లకి అది కూడలి లాంటిది. అక్కడ వ్యవసాయం ప్రధాన ప్రవృత్తి ప్రజలకి. కనువిందు చేసే పంట పొలాలు, తోటలు, చెట్లు, చేమలతో పచ్చపచ్చగా కళకళలాడుతూ ఉంటుంది. వ్యాపారపరంగా మాత్రం ఆ ఊరు అంతగా అభివృద్ధి చెందలేదు. ఆ లోటునే వరంగా మలచుకున్నాడు నాగరాజు. ఆ అవకాశాన్ని బాగా అందిపుచ్చుకున్నాడు. జానకమ్మకు ఇంకా స్పష్టంగా గుర్తుంది గతం. నాగరాజు ఆనాడు బికారిలా, బిక్కుబిక్కుమంటూ పొట్టచేతపట్టుకుని తమ ఊళ్లోకి అడుగుపెట్టాడు బ్రతుకుతెరువుని వెతుక్కుంటూ. అప్పుడు ధర్మయ్య భార్యతో కలసి గుడికి వెళ్లి దైవదర్శనం చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. నాగరాజు ఆ దంపతులకి రెండు చేతులెత్తి నమస్కరించాడు. జోడించిన ఆ చేతులు చాలాసేపటికిదాకా అలాగే ఉండిపోయాయి. ధర్మయ్య ఆశ్చర్యపోయాడు. అతడి గురించి వివరాలు కనుక్కుంటూ ప్రశ్నలు వేసి సమాచారం రాబడుతూ తన వెంట నడిపించాడు. నాలుగైదు వీధులగుండా సాగింది వాళ్ల నడక. నాగరాజుకి విస్మయం కలిగింది ధర్మయ్యకి ఆ ఊళ్లో ఉన్న పరపతి, గౌరవం చూసి. ఆడమగ, పిల్ల పెద్ద అందరూ రెండు చేతులతో దండాలు పెట్టడమే. ఈ ఊళ్లో ఆయన మాటకి తిరుగుండదని అర్థమయిపోయింది. ఇంటికొచ్చాక నాగరాజుకి కడుపునిండా రుచికరమైన భోజనం పెట్టించాడు. జన్మలో ఎరగడు అంతటి ఘనమైన భోజనం. నవకాయ వంటకాలతో, సుష్టుగా తిని బ్రేవ్‌మని త్రేన్చాడు. జానకమ్మకు అప్పుడే నచ్చలేదు అతని వాలకం. తింటూ తింటూ తల పైకెత్తి పైకప్పుకేసి చూస్తాడేంటి? ఇదేం బుద్ధి? ఏం మనిషి అనుకుందామె.

భోజనం అయ్యాక విశ్రాంతి తీసుకొమ్మని చాప దిండు ఏర్పాటు చేసాడు ధర్మయ్య. అప్పుడే నిర్ణయం తీసుకున్నాడు నాగరాజు. ధర్మయ్య దగ్గర ఆశ్రయం తీసుకుని ఎంతో పైకెదగాలి. ఆయన్ని మించిపోవాలి. ఇంకా ఎన్నెన్నో అనుకున్నాడు. అవన్నీ నెరవేరాలంటే ఈ ఇంట్లో పాగా వేయాలి. పిచ్చి ధర్మయ్యను వశం చేసుకునేలా నటించాలి.

***

ఓ పాత పెంకుటిల్లు అమ్మకానికి వస్తే ధర్మయ్య తనే అడ్వాన్స్ ఇచ్చి నాగరాజు చేత కొనిపించాడు. అనతి కాలంలోనే దాన్ని పడగొట్టి ఓ పక్కా భవంతిని నిర్మించుకునే స్థాయికి ఎదిగాడు అతను. ఇల్లయితే ఏర్పరచుకున్నాడుగానీ ఇల్లాలు అంత తేలిగ్గా దొరుకుతుందా? ఊరూ పేరూ లేని వాడని నాగరాజుకి పిల్లనిచ్చేవారు కరువయ్యారు.

"దిగులు పడకు తమ్ముడు... నేను లేనా?" అంటూ భుజం తట్టాడు ధర్మయ్య. స్వయంగా తానే ఎన్నో ఊళ్లు తిరిగి తిరిగి చివరకు కేశవపురం షావుకారిగారి సంబంధం ఖాయం చేసాడు. నాగరాజు సంతోషంతో ఎగిరి గంతేసాడు. ఆ అమ్మాయి నల్లగా ఉంటేనేం? కళ్లు చెదిరే నగానట్రా ఉన్నాయి. కొంచెం స్థూలకాయురాలే అయినా అపరిమితమైన ఆస్తిపాస్తులకి అభ్యంతరాలన్నీ హుష్‌కాకి అవుతాయి. అయినా నాగరాజుకి ఎలాంటి ఊహలు, అంచనాలు లేవు కాబోయే భార్య గురించి. బాగా ధనవంతురాలి కూతుర్ని భార్యగా పొందాలనే అతని కోరిక ధర్మయ్య మూలంగా నెరవేరింది. అప్పట్నుంచీ అతని ప్రవర్తన మారింది. కళ్లు నెత్తికెక్కాయి. అంతకుముందు ధర్మయ్య ఎదుట భయం భయంగా చేతులు కట్టుకుని వొదిగి నిలబడేవాడు. ఇప్పుడు 'ఏం ధర్మయ్యా' అంటూ ఏకవచన ప్రయోగంతో మాట్లాడడం జానకమ్మకి

కోపం తెప్పించింది. భుజంమీద చేయి వేసి మాట్లాడేంత గొప్పవాడయ్యాడా? అంతేకాదు, తాము ఉండే ఇంటిని కొంటాడట, పొలం ఎంతకు అమ్ముతారని బేరమాడాడు.

జానకమ్మ ముందునుంచీ నాగరాజు నైజాన్ని కనిపెడుతూనే వుంది. నాగరాజు వినయంలో నక్క, విషయంలో నాగు లాంటివాడు. కృతఘ్నత మనుష్యుల్ని ఇంతగా మార్చివేస్తుందా? జానకమ్మ ఈ విషయాన్ని జీర్ణించుకోలేపోతోంది. షాక్ తగిలిన దానిలా అయిపోయింది ఆవిడ పరిస్థితి. ఒక నడిరాత్రి ధర్మయ్యకు దాహంవేసి మెలకువ వచ్చినప్పుడు జానకమ్మ నిద్ర పోకుండా ఆలోచిస్తూ కూర్చుని ఉండడం ధర్మయ్యను ఆశ్చర్యపరిచింది.

"ఎందుకు జానకీ అంత తీవ్రంగా ఆలోచించి ఆరోగ్యం పాడు చేసుకుంటావు? మన రాతలో ఉంటే మనది. లేనప్పుడు ఎంత తాపత్రయపడినా లాభం ఉండదు" అన్నాడు తాత్వికంగా.

"ఆ నాగరాజును చేరదీసి పెద్ద తప్పు చేసాం" అందామె కోపంగా.

ధర్మయ్య చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"మంచిచెడు ఇవన్నీ మనం పట్టించుకోవద్దని ప్రకృతిని చూసి నేర్చుకోవాలి జానకీ. మన ఉరి చెరువు చూడు. ఈ ఊరివాడా పరాయివాడా



అని తారతమ్యం లేకుండా అది అందరి దాహం తీర్చడంలేదూ? ఆ చెరువు గట్టుమీదున్న పెద్ద రావిచెట్టు మాటేమిటి? కత్తులు ధరించేవాడికి, కాషాయం కట్టేవాడికి తన చల్లని నీడతో సేద తీర్చడంలేదూ. ఇకనుంచి నాగరాజే కాదు ఏ వ్యక్తి గురించి మనం చెడుగా మాట్లాడకుండా ఉందాం'' ధర్మయ్య అంత చక్కగా విడమర్చి నచ్చచెప్పినా జానకమ్మ మనస్తాపం పోలేదు. తమది దిగువ మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. తొంభైవేలు నష్టం అంటే మాటలా? ఎలా సరిపెట్టుకోవాలి? నాగరాజు సీతాపురంలోకి అడుగుపెట్టినప్పుడు కాళ్లకి చెప్పులు కూడా లేవు. కడుపులో ఆకలి, వంటి మీద చిరుగుల బట్టలు తప్ప. తరువాత ధర్మయ్య జాలి తలచి వ్యాపారం చేయమని ప్రోత్సహించాడు. మొదట్లో పెట్టుబడి కూడా తనే ఏర్పాటుచేసాడు. చుట్టుపక్కల పల్లెటూళ్లకి సైకిల్‌మీద తిరుగుతూ చీరల వ్యాపారం చేసాడు. సీతాపురంలో చిన్న కిరాణా కొట్టు పెట్టాడు. పాల అమ్మకంలో కూడా బాగానే కలిసొచ్చింది. తరువాత ఓ మోపెడ్ కొనుక్కున్నాడు. వడ్డీ వ్యాపారంలో నాగరాజు బాగా లాభపడ్డాడు. మెడలో పులిగోలు బంగారు గొలుసు, చేతికి బ్రాస్‌లెట్... దర్జా చూపించడం మొదలుపెట్టాడు.డబ్బు విషయంలో అతని కక్కుర్తి బుద్ధి జానకమ్మకి బాగా తెలిసిపోయింది. ఎప్పుడూ భోజనం సమయానికి తమ ఇంటికి వచ్చేవాడు. తినడం, ఏదో ఒకటి కూరగాయలో, పండ్లో పట్టుకువెళ్లడం చేసేవాడు. ధర్మయ్య పాతకాలపు మంచి మనస్తత్వాన్ని నాగరాజు వీలైనంత మేరకు ఉపయోగించుకునేవాడు. తన దగ్గర్నుంచి చీపురుపుల్లని జారనిచ్చేవాడు కాదు. ఏనాడూ గౌరవంతో పండో ఫలమో దానం చేసిన దాఖలా లేదు. దేవుడు శిక్షిస్తాడు. ఊరుకోడు అనుకునేది జానకమ్మ ఆక్రోశం పట్టలేక. అలాగే జరిగింది కూడా.

## గ్రీటింగ్ కార్డ్ చరిత్ర

ఈజిప్టులో అనాదికాలంలో నూతన సంవత్సరంనాడు మిత్రులకీ, బంధువులకీ చిత్రాలని కానుకలుగా పంపే సంప్రదాయం ఉండేదిట. తర్వాత దాన్ని రోమన్లు అనుకరించారు. ఈనాడు మనమంతా పంపించే గ్రీటింగ్ కార్డులకి జన్మనిచ్చినవాడు లండన్ విక్టోరియా-ఆల్బర్ట్ మ్యూజియం డైరెక్టర్ సర్ హెన్రీ కోల్. 1843లో వ్యక్తిగతంగా అందరికీ క్రిస్మస్ కార్డులు పంపించేటంత తీరికలేక జాన్‌హార్స్లే అనే ఆర్టిస్టుని పిలిచి ఓ కార్డు తయారు చేయించి వాటికి కాపీలు తీసి పంపించాడట!


## కుర్చీలో వాటర్ డ్రాగన్

థాయ్‌లాండ్‌కి చెందిన సాంటిసాక్ అనే అతను రెండు దశాబ్దాలుగా అనేక జంతువులకి శిక్షణనిచ్చి వాటి చేత అనేక ఫీట్లు చేయిస్తూ సినిమాల్లో, యాడ్స్‌లో వాటి చేత ప్రదర్శనలు ఇప్పిస్తుంటాడు. బ్యాంకాక్‌లో ఒక వాటర్ డ్రాగన్ కుర్చీలో స్టయిల్‌గా కూర్చుని చూపరులకి ఫోజులిచ్చింది.

## బుద్ధుడి ఆకృతిలో బేరిపళ్లు

బుద్ధుడి ఆకృతిలో వున్న ఈ బేరీపళ్లని చైనాలోని వెక్సియన్ కౌంటీలోని ఓ రైతు పండిస్తున్నాడు. హావోజియాంగ్ అనే ఆ రైతు ఆరేళ్లపాటు కష్టపడి ఈ పండ్లకి ఖచ్చితంగా బుద్ధుని ఆకారం ఉండేలా చేయగలిగాడుట. ఒక్కో పండు వెల సుమారు 350 రూపాయలు.

-తటవర్తి




★★★

ఆ రోజు ధర్మయ్య జిల్లా కేంద్రానికి వెళ్లి పని ముగించుకుని షేరింగ్ ఆటోలో సీతాపురానికి తిరిగి వస్తున్నాడు. వల్లభాపురం కల్వర్ట్ దాటాక రోడ్డుకి కుడిపక్క రక్తసిక్తమైన దుస్తులతో ఓ మనిషి పడి వుండడం చూసి ఆటోని ఆపాడు డ్రైవర్. అందరితోపాటు ధర్మయ్య కూడా ఆటో దిగాడు. ఎవరో ఏమిటో అనుకుంటుంటే అల్లంత దూరంలో మోపడ్ కనిపించింది. అది నాగరాజుదే. ధర్మయ్య గుండెలదిరిపోయాయి. దెబ్బలు బాగా తగిలి మూలుగుతున్న స్థితిలో నాగరాజున చూసి విచలితుడయ్యాడు ధర్మయ్య. ఏదో లారీ కొట్టేసి వెళ్లిపోయినట్టుంది. సమయానికి తనని పంపాడు దేవుడు అనుకుంటూ ఆటోడ్రైవర్‌ను బ్రతిమాలి అదే ఆటోలో హుటాహుటిన జిల్లా కేంద్రానికి తీసుకుపోయి నాగరాజుని హాస్పిటల్‌లో చేర్పించాడు.

★★★

పదిరోజులు గడిచాయి. నాగరాజు పూర్తిగా కోలుకున్నాడు. ధర్మయ్య అతడ్ని క్షణం కూడా వదలకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. నాగరాజు శరీరంపై గాయాలు మానడంతోపాటు మనసులో కల్మషం కూడా కొట్టుకుపోయింది. ధర్మయ్య చేతులు పట్టుకున్నాడు. మొహంలో పశ్చాత్తాపం. కళ్లల్లో అశ్రుకణాలు.

"ఏంటి తమ్ముడు ఇది?'' అభిమానంగా అన్నాడు ధర్మయ్య.

"బాబుగారూ!'' అత్యంత గౌరవంతో పిలిచాడు నాగరాజు. "ఆనాడు మీ పంట తాలూకు పైకం తొంభైవేలు తీసుకున్నాను. తరువాత గర్వంతో కళ్లు మూసుకుపోయి మీరసలు నాకు డబ్బే ఇవ్వలేదన్నాను. సాక్ష్యాధారాలు చూపించమని వాగాను. మీలాంటి మంచి మనుష్యులకి కష్టం కలిగిస్తే దేవుడు ఊరుకుంటాడా? ఇలా బుద్ధి చెప్పి నా కళ్లు తెరిపించాడు.''

"అదంతా ఇప్పుడెందుకోయ్? విశ్రాంతి తీసుకో'' అన్నాడు ధర్మయ్య.

"బాబుగారూ!మీకు నేను బాకీ ఉన్నది తొంభైవేల రూపాయలు. దాన్ని తీర్చగల స్థోమత ఉందనుకోండి. అయితే నేను తీర్చలేని బాకీ మాటేమిటి?'' అన్నాడు నాగరాజు. ధర్మయ్య అర్థం కానట్టు చూసాడతని ముఖంలోకి.

"రక్తం కళ్లజూడాల్సిన నాకు మీ రక్తంతో ప్రాణదానం చేసారు. అది వెల కట్టలేని బాకీ'' అన్నాడు నాగరాజు.

నర్సు వచ్చి ఇంజెక్షన్ చేసి వెళ్లిపోయింది. జానకమ్మతోపాటు నాగరాజు భార్య కూడా ఉందక్కడ.

"ఈ జన్మకి కాదుగానీ బాబుగారూ... మరుజన్మలో మీ ఇంటి కుక్కగా పుట్టాలని దేవుడిని ఒక్క వరం కోరుకుంటాను''

ఆ మాటలకి జానకమ్మ సైతం చలించిపోయింది.

శీతల పవనం హాయి గొల్పుతూ వీస్తోంది.

★